# అసంబద్ధ నిర్ణయం.. మోయలేని భారం

- భూముల ధరలు భారీగా పెంచిన ప్రభుత్వం
- 20 శాతం లోపే అని చెప్పి 80-90 శాతం పెంపు
- సామాన్య ప్రజలపై పెనుభారంగా రిజిస్ట్రేషన్ ఫీజు
- బెంబేలెత్తిపోతున్న కొనుగోలుదారులు



బండి ఆత్మకూరు రిజిస్ట్రేషన్ ఆఫీస్

**బండి ఆత్మకూరు:** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రేట్ల పెంపు అసంబద్ధంగా ఉందని బండి ఆత్మకూరు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి నూతనంగా భూముల ధరలు భారీగా పెంచారని, దీంతో రిజిస్ట్రేషన్లకు భూ కొనుగోలుదారులపై మోయలేని భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఖాళీ స్థలాల ధరలు వందశాతం పెంపు..**

రేట్ల పెంపు 20 శాతానికి మించరాదని రాష్ట్ర రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ చెప్పినప్పటికీ బండిఆత్మకూరు మండలంలో వ్యవసాయ భూములకు 80-90 శాతం, ఖాళీ స్థలాలకు 100 శాతం పెంచారు. గతంలో మండలంలోని గ్రామాల్లో గవర్నమెంట్ రేటు ఎకరాకు రూ.2,20,000 ఉండగా, పెంచిన రేట్ల ప్రకారం ఇపుడు ఎకరా రేటు అమాంతం రూ.4 లక్షలకు పెరిగింది. దీని వల్ల గతంలో ఎకరాకు రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ రూ.17 వేలు ఉండగా, నేడు రూ.30 వేలు పడుతుంది. దీంతో సామాన్య ప్రజలు పొలాల రిజిస్ట్రేషన్ అంటేనే బెంబేలెత్తే పరిస్థితి నెలకొంది. క్షేత్ర స్థాయిలో విచారించకుండా, ప్రజల అభిప్రాయం తెలుసుకోకుండా ఏకపక్షంగా, అసంబద్ధంగా భూముల రేట్ల పెంచడం వల్ల సామాన్య ప్రజలపై పెను భారం పడుతోంది. భారీగా పెంచిన రేట్లను పునఃసమీక్షించి తగ్గించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### పేదలపై భారం మోపడం తగదు



చంద్రబాబు తన సంపద సృష్టిలో భాగంగా రేట్లు పెంచి, మధ్య తరగతి ప్రజల నుంచి స్టాంప్ డ్యూటీ వసూలు చేసి, పేదలపై భారం మోపడం తగదు. నాకు గుర్తు వచ్చినప్పటి నుంచి చూస్తున్నా .. చంద్రబాబు నాయుడు పాలన ఎప్పుడైనా కార్పొరేట్లకు ప్రయోజనం కలిగే విధంగా ఉంటుంది కానీ పేదలకు కాదు. ఈ విధంగా ప్రభుత్వం భూముల రేట్లు రెట్టింపు చేయడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం కానీ, మార్కెట్ రేటు రెట్టింపు అయ్యి సామాన్య ప్రజలకు ప్రయేజనం కలగదు కదా?.

– ఇటికెల చిన్న సుబ్బారెడ్డి, ఇంటెలెక్చువల్ ఫోరం శ్రీశైలం నియోజకవర్గ అధ్యక్షుడు

## క్లుప్తంగా

### వాల్మీకి ఆలయ నిర్మాణానికి శ్రీకారం



వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

**మిడుతూరు:** మండలపరిధిలోని రోళ్లపాడు గ్రామంలో వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. వాల్మీకి నాయకులు గౌరీశ్వర నాయుడు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రచించిన రామాయణం మన భారతీయ సంస్కృతికి మూలస్తంభమన్నారు. ఆలయ నిర్మాణంలో గ్రామంలో ధర్మబోధన, ఆధ్యాత్మిక భావాలు పెంపొందడానికి దోహద పడుతుందన్నారు. ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పేరెడ్డి వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచ్ రామస్వామిరెడ్డి, గ్రామ పెద్దలు మురళీమోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, వాల్మీకులు పాల్గొన్నారు.

### క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో సర్పంచ్, గ్రామస్తులు

**ఆత్మకూరు:** పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ఇన్విటేషన్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం కోర్టు నంబర్–2లో పి.కోటకొండ వర్సెస్ కర్నూలు జట్ల మధ్య మ్యాచ్‌ను వెలుగోడు సర్పంచ్ వేల్పుల జయపాల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొన్న వారు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు రామ్మోహన్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్ జయపాల్‌ను పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు.


### ఉమామహేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



ఉమామహేశ్వరాలయంలో పూజలు చేస్తున్న డీఎస్పీ

**కొత్తపల్లి:** మండలంలోని సప్తనదీ సంగమేశ్వరం ఎగువ పుష్కర ఘాట్ వద్ద ఉన్న ఉమామహేశ్వరాలయంలో ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామ శర్మ డీఎస్పీ దంపతులతో లలితాదేవి అమ్మవారికి, శివలింగానికి కృష్ణాజలాలతో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతీ వంటి విశేష పూజలు చేయించారు. అనంతరం మరబోట్లో వెళ్లి కృష్ణానది జలాల నుంచి బయటపడుతున్న ప్రాచీన సంగమేశ్వరాలయాన్ని సందర్శించారు.

### తూడిచెర్ల సబ్‌చానల్‌కు 655 క్యూసెక్కులు



కేసీ కాల్వలో ప్రవహిస్తున్న నీరు


**జూపాడుబంగ్లా:** లాకిన్స్‌లా నుంచి తూడిచెర్ల సబ్‌చానల్‌కు 655 క్యూసెక్కుల సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2,100 క్యూసెక్కుల సాగునీరు సరఫరా అవుతోందన్నారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 815 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. ఈ నీటిని ఏబీఆర్ కాల్వకు 150 క్యూసెక్కులు, నిప్పులవాగుకు 10 క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌చానల్ కాల్వకు 655 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల పథకాల నుంచి కేసీ కాల్వకు సాగునీటిని బంద్‌చేసినట్లు వెల్లడించారు.

### పోస్టర్ల విడుదల

**ఆత్మకూరు:** పట్టణంలోని అంబేడ్కర్ స్ఫూర్తి కేంద్రంలో 'లక్షల డప్పుల గొంతుకల'కు సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకులు చిలక రాబిన్సన్ మాదిగ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలుకై 'లక్షల డప్పుల వేల గొంతుక' మాదిగల భారీ ప్రదర్శన హైదరాబాద్‌లో ఈనెల 7వ తేదీన ఎల్‌బీ స్టేడియంలో నుంచి పెద్ద అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆత్మకూరు మండలంలో ఉన్న మాదిగ జాతి ప్రజలందరూ పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి భాషపోగుల దరగయ్య మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బుజ్జి మాదిగ, జిల్లా నాయకులు దేవ సహాయం, నియోజకవర్గ కార్యదర్శి రామారావు, మండల అధ్యక్షులు వనమాల పుల్లయ్య పాల్గొన్నారు.

## రేపు సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం





సూర్య నారాయణ స్వామి మూలవిరాట్, సూర్య నారాయణ స్వామి ఆలయం

**నందికొట్కూరు:** రథసప్తమి సందర్భంగా పట్టణంలోని కోటా వీధిలో వెలసిన శ్రీ సూర్యనారాయణ ఆలయంలో ఈనెల 4న స్వామివారి కల్యాణం, రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు సురేషకుమార్, నాగభూషణ రావు ఆదివారం తెలిపారు. పట్టణంలోని పురవీధుల గుండా కల్యాణ మూర్తుల ఊరేగింపు ఉంటుందని చెప్పారు. మంగళవారం ఉదయం 5 గంటలకు స్వామి వారికి అభిషేకం, 8 గంటల నుంచి 10 గంటల వరకూ రథసప్తమి, దాతల కుంకుమార్చన కార్యక్రమం, 10 గంటల నుంచి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం 1 గంటలకు స్వామి వారి తీర్థ ప్రసాద వినియోగం, 3 గంటల నుంచి పుర వీధుల గుండా కళ్యాణ మూర్తుల ఊరేగింపు జరుగుతుందన్నారు. కల్యాణంలో కూర్చునే దంపతులు రూ.300 చెల్లించి గోత్రనామములు నమోదు చేయించుకోవాలని కోరారు.

## మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్

**నందికొట్కూరు:** గీత కులాలకు కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్‌శాఖ సీఐ రామాంజనేయులు నాయక్ కోరారు. ఆదివారం పట్టణంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో గీత కులాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నందికొట్కూరు మున్సిపాలిటి, జూపాడుబంగ్లా మండలానికి ఈడిగ కులస్తులకు రెండు మద్యం షాపులు, పగిడ్యాల మండలానికి గౌడ కులం వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఒక్కో దరఖాస్తు ఫీజు రూ. 2 లక్షల చొప్పున చెల్లించాలని తెలిపారు. లైసెన్స్ ఫీజులో సగం మాత్రమే చెల్లించేలా వెసలుబాటు కల్పించిందని చెప్పారు. కేటాయించిన కులాల వారు మాత్రమే ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

**మద్యం దుకాణాల కేటాయింపు**

**ఆత్మకూరు:** పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఆదివారం ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ గీత కులాలవారితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గీత కులాల వారికి ఆత్మకూరు పట్టణం, పాములపాడు మండలం, కొత్తపల్లి మండలంలో ఒక్కొక్కటి చొప్పున ప్రభుత్వం మద్యం దుకాణాలు కేటాయించిందన్నారు. గీత కులాలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎమైనా సందేహాలు ఉంటే సెల్ 94409 02585, 83283 07774, 91772 99067 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

## బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్, పోలీసులు

**నందికొట్కూరు:** పట్టణ పరిధిలోని నీలిషికారిపేటలో నాటు సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 500 లీటర్ల బెల్లం ఊటను టౌన్ సీఐ, పోలీసులు ధ్వంసం చేశారు. నీలిషికారి జానుభా నుంచి 50 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నాటు సారా స్థావరాలపై టౌన్ సీఐ ప్రవీణ్‌కుమారెడ్డి, పోలీసులు ఆదివారం విస్తృత దాడులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చట్టానికి వ్యతిరేకంగా నాటు సారా తయారు చేసినా, విక్రయించిన, ఇతర ప్రాంతాలకు తరలించిన క్రిమినల్ కేసులతో పాటు వాహనాలు సీజ్ చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

## 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

**నంద్యాల(న్యూటౌన్):** రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీటీఎఫ్‌కు కృషి చేసిన రామకృష్ణ మృతి పట్ల సంస్మరణ సభను నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 జూలై 1 నుంచి అమలు కావాల్సిన పీఆర్సీ రెండు సంవత్సరాలుగా అమలు కాలేదన్నారు. తక్షణమే పీఆర్సీ వేసి అమలు చేయాలన్నారు. కరువు భత్యాలను విడుదల చేసి ప్రావిడెంట్ ఫండ్ రుణాలు, ఏపీజీఎల్ఐ రుణాలు, మెచ్యూరిటీ బాండ్లకు సంబంధించిన మొత్తాలను విడుదల చేయాలని, 2022 జూన్ నుంచి దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులకు సంబంధించిన మొత్తాన్ని విడుదల చేయాలన్నారు. 11వ పీఆర్‌సీ, అరియర్స్, పాత డీఏ బకాయిలు జమ చేయాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. మాజీ అధ్యక్షుడు బాలనాగిరెడ్డి, జిల్లా సభ్యులు జాకీర్‌హుసేన్, వీరేశ్వరరెడ్డి, రాజ్‌కుమార్, కుమారి, రాములమ్మ, కృష్ణమోహన్, దస్తగిరిబాషా, నాగార్జున, వెంకటరాముడు, రవికుమార్ పాల్గొన్నారు.

## 6న జిల్లా టార్గెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

**నంద్యాల(న్యూటౌన్):** ఈనెల 8, 9 తేదీల్లో ఈస్ట్ గోదావరిలో జరగబోయే సబ్ జూనియర్ 16 సంవత్సరాల్లోపు బాలురు, బాలికల టార్గెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే నంద్యాల జిల్లా జట్టు కోసం ఈనెల 6వ తేదీన ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా టార్గెట్‌బాల్ అసోసియేషన్ నిర్వాహక కార్యదర్శి నాగరాజు ఆదివారం తెలిపారు. బనగానపల్లె పట్టణంలోని నెహ్రూ ఇంగ్లిష్ మీడియం స్కూల్ క్రీడా ప్రాంగణంలో ఉదయం 10.30 గంటలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు. హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్ క్రీడల్లో ప్రావీణ్యం ఉన్న వారు కూడా అర్హులని తెలిపారు. వివరాలకు సెల్: 9000149695 నంబరులో సంప్రదించాలని కోరారు.

## భద్రావతి భావనారుషి స్వామికి జలాభిషేకం



కలశాల్లో జలాన్ని తెచ్చిన భక్తులు

**నంద్యాల(వ్యవసాయం):** పట్టణంలోని భద్రావతి భావనరారుషి కల్యాణ మండపంలో పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో శ్రీభద్రావతి సమేత భావనారుషి స్వామి వారికి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు స్వామి వారికి బిందె సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు 108 కలశాలతో చెరువు కట్ట నుంచి మేళతాళాలతో జలాన్ని ఊరేగింపుగా తీసుకొని వచ్చి స్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం గుడిపాటిగడ్డలో వెలసిన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. సంఘం అధ్యక్షుడు గాజుల వేణు, మున్సిపల్ మాజీ కౌన్సిల్ భీమునిపల్లె వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

### తాటిపాడులో నిలిచిన నీటి సరఫరా

**జూపాడుబంగ్లా:** మండలంలోని తాటిపాడు గ్రామంలో నాలుగు రోజుల నుంచి కుళాయిలకు నీటి సరఫరా లేకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామసచివాలయం పక్కన్నే ఉన్న తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీళ్లు సరఫరా అయ్యే విద్యుత్ మోటారు మరమ్మతులకు గురవ్వడంతో కుళాయిలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామంలోని సగం మంది ప్రజలకు తాగునీరు సరఫరా అవుతుండగా సర్పంచ్ నివాసం ఉంటున్న కాలనీతో పాటు ఎస్సీ, బీసీ, బైరెడ్డినగర్ కాలనీలకు నాలుగు రోజుల నుంచి తాగునీటి సరఫరా కావడం లేదు. వాష్‌రూం, స్నానాలకు వెళ్దామన్నా నీళ్లులేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సగం మందికి నీళ్లుసరఫరా చేసి సగం మందికి నీటిని సరఫరా చేయకపోవటం సమంజసంగా లేదని పేర్కొంటున్నారు. గ్రామంలో సరైన చేతిపంపుల్లేక సమీపంలోని పంట కాల్వల్లోని నీటిని పట్టుకుంటున్నామని చెబుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని త్వరగా మోటారుకు మరమ్మతులు చేయించి కుళాయిలకు తాగునీటి సరఫరా చేయించాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి తిప్పన్నను సంప్రదించగా.. సత్వరమే మోటారుకు మరమ్మతులు చేయించి గ్రామస్తులకు తాగునీటి కుళాయిలకు సరఫరా చేస్తామని తెలిపారు.

### శ్రమశక్తి సంఘాలను రిజిస్ట్రేషన్ చేయించుకోండి

**జూపాడుబంగ్లా:** శ్రమశక్తి సంఘాలను ఉపాధి హామీ పథకం కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏపీఓ గౌరీబాయి సూచించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లోని 50 మంది ఉపాధికూలీలు కలిసి ఓ శ్రమశక్తి సంఘంగా ఏర్పడాలన్నారు. వారిలో విద్యార్హతలున్న వారిని మేట్‌గా ఎంపిక చేసుకొని శ్రమశక్తి సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. 50 ఏళ్లలోపు ఉండి కనీసం పదో తరగతి విద్యాభ్యాసం ఉన్న వారిని వేజీకర్స్ ఏకాభిప్రాయంతో మేట్‌గా ఎన్నుకోవచ్చని చెప్పారు. మేట్‌గా ఉన్న వ్యక్తికి ఉపాధికూలీలతో పాటు తప్పనిసరిగా పనిచేయాల్సి ఉంటుంది. కూలీలతో పాటు మేట్‌కు రోజువారి వేతనం చెల్లిస్తారు.

### 'ఫీజు పోరు'కు భారీగా తరలిరండి

**పగిడ్యాల:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 5వ తేదీన జిల్లా కలెక్టరేట్ల వద్ద చేపట్టిన ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, అభిమానులు, నాయకులు భారీగా తరలి రావాలని నంద్యాల జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు గుజ్జల రమేష్‌నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన పడమర ప్రాతకోటలో విలేకరులతో మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం సాధ్యం కాదని, ఆర్థిక పరిస్థితులు బాగా లేవని ప్రజలు అర్థం చేసుకోవాలని చెప్పడం సిగ్గుచేటన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల మెనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి 98 శాతం హామీలను నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. అధికాకం లేక పోయినా ప్రజల పక్షాన పోరాడేందుకు జగనన్న ఫీజు పోరుకు పిలుపునిచ్చారని, దీనిని విజయవంతం చేసేందుకు విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణ, సురేంద్ర, అలీబాషా, అమీర్‌బాషా తదితరులు ఉన్నారు.

### ముగిసిన జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలు

**నంద్యాల(న్యూటౌన్):** పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాలలో జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలు ఆదివారం ముగిశాయని క్రీడా భారతి గౌరవాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్ తెలిపారు. క్రీడా భారతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి మాట్లాడుతూ నంద్యాలలో జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలు విజయవంతం చేయడం అభినందనీయమన్నారు.

### బడ్జెట్లో తగిన ప్రాధాన్యత కల్పించారు

**ఆదోని సెంట్రల్:** కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్య, వైద్యం, ఆరోగ్యం వంటి రంగాలకు తగిన ప్రాధాన్యత కల్పించారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వీరేష్ ఆదివారం తెలిపారు. విద్యారంగానికి రూ.1.20 లక్షల కోట్ల నుంచి రూ.1.28 లక్షల కోట్లు పెంచడం జరిగిందన్నారు. విద్యార్థులలో సృజనాత్మకతను పెంచడానికి అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌ను 50 వేల ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారని చెప్పారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**వెలుగోడు :** వెలుగోడు నుంచి బోయరేవులకు వెళ్లే రహదారిలో రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బోయరేవుల గ్రామానికి చెందిన మల్లికార్జున అనే వ్యక్తి బైక్‌పై వెలుగోడుకు వచ్చి తమ పనులు ముగించుకొని బోయరేవుల గ్రామానికి వెళ్తుండగా నంద్యాల నుంచి వెలుగోడుకు వస్తున్న బొలేరో వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో మల్లికార్జున అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కుడికాలు తీవ్రంగా గాయం కావడంతో 108లో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు



అభయహస్తం, శంఖుచక్రాలతో సరస్వతీదేవి



చడీహోమం నిర్వహిస్తున్న భక్తులు

**జూపాడుబంగ్లా:** వసంతపంచమిని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలోని క్వార్టర్స్‌లో వెలసిన శ్రీవీణాపాణి సరస్వతీదేవి అమ్మవారి పుట్టినరోజు వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహశర్మ అమ్మవారికి ముందుగా పంచామృతాభిషేకం నిర్వహించి కుంకుమార్చన, పుష్పార్చన వంటి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని పట్టువస్త్రాలు, ఆభరణాలతో దేదీప్యమానంగా అలంకరించారు. అభయహస్తం, శంఖుచక్రాలతో నిజస్వరూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అనంతరం అర్చకులు లక్ష్మీనరసింహశర్మ భక్తులతో మహన్యాసక రుద్రాభిషేకం, మహామృత్యుంజయ చండీహోమం నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయించారు. సాయంత్రం అమ్మవారికి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

**ఘనంగా వసంత పంచమి వేడుకలు**

**పగిడ్యాల:** మండలంలోని నెహ్రూనగర్, పగిడ్యాల, పడమర ప్రాతకోట గ్రామాల్లో ఆదివారం వసంత పంచమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. సరస్వతి దేవి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితుల చేత చిన్నపిల్లలకు విద్యాభ్యాసం కార్యక్రమాన్ని చేపట్టి సరస్వతి దేవి విశిష్టతను చాటారు.

## కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం



బడ్జెట్ బిల్లుల ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

**జూపాడుబంగ్లా:** కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేదని సీపీఎం నాయకుడు కర్ల, పక్కీర్‌సాహెబ్ అన్నారు. మండలంలోని 80బన్నూరు గ్రామంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఆదివారం సీపీఎం నాయకులు కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. వారు మాట్లాడుతూ బడ్జెట్‌లో నిరుద్యోగ నిర్మూలన కోసం కేటాయింపు, పన్నుల భారం తగ్గింపు, తదితర అంశాలపై నిరుద్యోగులు, సామాన్య, మధ్యతరగతి ప్రజలు పెట్టుకొన్న ఆశలపై నీళ్లు చల్లారన్నారు. పార్లమెంటులో 16మంది ఎంపీలను కలిగిన కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో ఘోరంగా విఫలం అయిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు గోపాలకృష్ణ, శ్రీనివాసులు, రాము, ఉస్మాన్, దేవరాజు, షేక్షావలి, శ్రీరాములు, నాగేశ్వరరావు,రమణ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో రాష్ట్రానికి మళ్లీ మొండి చెయ్యి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

**ఆత్మకూరు:** పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ మొండి చేయి చూపించిందని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ అన్నారు. ఆదివారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన తీవ్ర అన్యాయాన్ని నిరసిస్తూ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు ముందు కేంద్ర బడ్జెట్ కాపీలను దగ్ధం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్యాకేజీ వంటి విభజన హామీలను పక్కన పెట్టిందన్నారు. విభజన చట్టం ప్రకారం వచ్చిన ఏ జాతీయ విద్యాసంస్థకు కేటాయింపులు చేయలేదని, విశాఖ రైల్వేజోన్, ఎన్ఐటీ, వెనకబడిన జిల్లాల నిధులు, రాజధాని నిర్మాణానికి నిధుల ఊసే లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్, ఎ.సురేంద్ర, జి.నాగేశ్వరరావు, వీరన్న, భాస్కర్, నాయకులు మాబాషా, ఎ.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మాలల యుద్ధగర్జనకు తరలిరండి



మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

**శ్రీశైలంప్రాజెక్ట్:** కర్నూలు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో ఈనెల 23న జరిగే మాలల యుద్ధగర్జన సభకు లక్షలాదిగా తరలిరావాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీశైలంప్రాజెక్ట్ జలవనరులశాఖ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను సుప్రీం కోర్టు ధ్రువీకరించలేదని, ప్రధాని మోదీ ఆడుతున్న నాటకంలో మంద కృష్ణ మాదిగ పావులా మారాడన్నారు.

**దళితులకు అన్యాయం జరిగితే సహించేదిలేదు.**

దళితులకు అన్యాయం జరిగితే సహించేదిలేదని తెలంగాణ రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు బూర్గుల.వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలంప్రాజెక్ట్‌లో దళితులు కాపాడుకుంటున్న ప్రభుత్వ భూమిని స్థానిక ఎమ్మెల్యే సహకారంతో అగ్రవర్ణాలు ఆక్రమించుకున్నాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ కార్యాలయాలను కబ్జా చేస్తుంటే అధికార యంత్రాగం ఏమి చేస్తుందని ప్రశ్నించారు. ఈ గ్రామంలో దళితులు నివసిస్తున్నారని, దళితులకు కళ్యాణ మండపం, గృహనిర్మాణాలకు ప్రభుత్వ స్థలలాను ఇవ్వాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు జి.విజయ్‌బాబు, రాజేంద్రపాల్, నాని తదితరులు పాల్గొన్నారు.

### ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవ

**నంద్యాల(వ్యవసాయం):** త్వరలో జరిగే జంబులాపరమేశ్వరి తిరునాలను పురస్కరించుకొని నంద్యాల పట్టణంలోని కుందూ నది ఒడ్డున ఉన్న శ్రీజంబులాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం మన ఊరు, మనగుడి–మన బాధ్యత సభ్యుల ఆధ్వర్యంలో ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవ (ఆలయాన్ని శుభ్రం చేయడం ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని పరిసరాలను, గోపురాలను శుభ్రం చేశారు. ఉత్సవ మూర్తులు, పూజా సామగ్రిని శుభ్ర పరిచారు. ఆలయ కమిటీ సభ్యుడు జగన్ మాట్లాడుతూ శివకుమార్‌రెడ్డి, సభ్యుల ఆధ్వర్యంలో ఆలయాన్ని శుభ్ర పరచడంపై కృతజ్ఞతలు తెలియజేశారు.

### రేపు ప్రపంచ క్యాన్సర్ నివారణ దినం

**నంద్యాల(వ్యవసాయం):** ఈనెల 4వ తేదీన ప్రపంచ క్యాన్సర్ నివారణ దినం సందర్భంగా ఐఎంఏ ఉదయానంద క్యాన్సర్ ఆసుపత్రి మహిళా వైద్య విభాగం సంయుక్త నిర్వహణలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర రవికృష్ణ, నంద్యాల అధ్యక్షుడు మధుసూదన్, డాక్టర్ కల్పన ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ..4న ఆసుపత్రి నుంచి కలెక్టర్ ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహిస్తామమన్నారు. ముఖ్యఅతిథిగా న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీఫరూక్ పాల్గొంటారని చెప్పారు.